# ఋణవిముక్తి

డాక్టరు పిశిపాటి వెంకటరమణయ్యగారు

'లీలా! ఏమిటా అల్లరి? మగవాళ్ల మీద కెగబడ్డం? ఇంకా చిన్నపిల్ల వనుకొన్నావా?'

అని లోపల లేదో పని చేసుకొంటూ తటాలున బయటికి వచ్చి చూచిన సుందరమ్మగారు (లీలతల్లి) కేకేసింది. ఆమాటలు వినడంతోటే, అహర్నిశం నాతో యేదో చిల్లికజ్జం పెట్టుకోని అల్లరి చేస్తుండే లీల మహాపరాధం చేసినదానివలె చప్పున వెనక్కు తగ్గి గోడ కానుకొని బెదరిన లేడిలా యెడంగా నిలబడి చూస్తుంది. లీల సౌందర్యోపాసకురాలు. ఇదొకర్ని చూచి నేర్చుకొన్నది కాదు. ఒకరు చెబితే వచ్చిందీ కాదు. వొంటబుట్టింది. అతిశుభ్రం. తా నలా వుంటుంది. ఒకరలావుండా లనుకొంటుంది. మేడమీద తట్లలో గులాబీమొక్కలు, బంతిమొక్కలు యింకా యేవేవో రంగురంగుమొక్కలన్నీ పెట్టి రోజు స్వయంగా వాటికి నీళ్లు పోసి పెంచుతూ వుండేది. అవి పూలు బూస్తుంటే ఒక్క రేకైనా యెవర్నీ తుంచనిచ్చేది కాదు. నే నారోజున లీలను యేడిపిద్దామని, రెండు గులాబీపూలను తుంచాను. దానిమీద పట్టరాని కోపం వచ్చింది మాలీలకు నామీద. 'శేఖరం మామా!' అని మీద కెగబడి నాక్రాపునంతా పీకిపెట్టింది. లీలకు నన్ను చూస్తే మొదటినుండీ మహాప్రేమ. నే నేమి యేడిపించినా సరే, అవన్నీ తనమీద గల ప్రేమచేతనే అంటానని తెలుసుకోని, బదులుకుబదు లంటూ మహా సరదాగా మాట్లాడుతూ వుండేది. ఇంతవరకు మగ, ఆడ విచక్షణ గాని, తన పెర అనే భేదభావం గాని లీలకు నావిషయమై వుండేదే కాదు. సుందరమ్మగారు ఆరోజు కోపంచేసినది మొదలుకొని కొత్తమని షైపోయింది మాలీల. ఆరోజు మొదలు నేను కాలేజీనుండి రాగానే గంతేసుకొంటూ వచ్చి, నాజేబులు తడివి చూచేవాళ్లు గాని, పుస్తకాలు లాక్కునే వాళ్లు గాని, యెవరూ వుండే వాళ్లు కారు. నాదగ్గిర చదువుకొనేటప్పుడైనా, ఓరగా కూచోని, యెంతవర కవసరమో, అంతవరకే మాట్లాడుతూ వెళ్లిపొయ్యేది. ఆకాస్త మాటపలుకైనా, తన స్త్రీ స్వభావానికి భిన్నంగా నడుస్తున్నాదని అనుకొనిపోతారేమో అని భయపడ్డట్టుగా వుండేది. ఇన్నాళ్లూ నే నేదైనా తనకు తెలియని విషయం వొకటి చెబితే, దానిమీ దొక లక్షప్రశ్నలు వేసి, యితరసంగతు లింకా యెన్నో తనకు తెలియనివి నేర్చుకొనే టందు కవకాశం కలిపించుకొనేది. ఇప్పుడా కులానే చచ్చిపోయింది. ఎంతసేపటికి తన స్త్రీస్వభావానికి భంగం వచ్చేటట్టు ప్రవర్తిస్తున్నానా అని ఆలోచించుకొనే గొడవలోనే వుండేది. ఇంతదూర మెందుకు? ఆరోజు సుందరమ్మగారి గదమాయింపుపాఠంతోటే లీల కుండే తెలివితేటలు, ఉత్సాహం సన్నగిలాయి. అంతవరకు నేర్చుకొన్నదే నేర్చుకొన్నట్టయింది కాని, ఆపైన నే చెప్పిందీ కొద్దే, తను నేర్చుకొందీ కొద్దే. దానికి తోడు యింతలో లీల యుక్తవయస్కురా లయింది. ఇప్పుడిహ పురుషముఖావలోకనంకూడ ఆత్మగౌరవానికి లోప మనేభావం గట్టిగా తలకెక్కింది. అటుతరువాత కొన్నిమాసాలవరకు లీల నా కెదురుపడేదే కాదు. ఎప్పుడైనా యేమరుండి యెదురుపడ్డం తటస్థిస్తే, లేడిపిల్లలా చంగున యెగిరి ప్రక్కనున్న గదితలుపుచాటున నక్కేది. తలుపుసందులోనుంచి నే నవతలకి వెళ్లేనో లేదో అనిమాత్రం చూస్తుండేది.

మాధవరావుగారు యింగువ కట్టినగుడ్డ. తండ్రి తాత ముత్తాతలు దివాన్‌గిరీలు చలాయించి రావుబహదూర్లు, దివాన్‌బహదూర్లు సంపాదించినవారు. మాధవరావుగారికి తండ్రి చిన్నతనంలోనే పోవడంచేతను, పెద్దవాండ్లు దివాన్‌గిరీలు చలాయించిన సంస్థానాలు సన్నగిలిపోవడంచేతను, తను చదువుకొన్న విద్య వంశగౌరవానికి తగ్గ ఉద్యోగాన్ని సంపాదించడానికి చాలింది కాకపోవడంచేతను, పెద్దల సంపాదనపైన్నే ఆధారపడి సుఖంగా యింట్లో కూర్చునేవారు. ఇంటిమర్యాదలు,


అట్టహాసాలు తగ్గకుండానే పట్టుకొచ్చేవారు. పెద్దతోట. అందులో బంగళా. వాకిటముంద రెప్పుడు ఒక బిళ్ల లేని బంట్రోతు. ఓగుర్రము. ఓబండి. రెండు మేనాబండ్లు. వీటిని వుపయోగిస్తూవుంటే యివి యేమాత్ర మక్కర కొస్తాయో తెలిసేదే కాని, నే నెరిగింతరువాత వాటి కాఅవస్థ పట్టలేదు. బంగాళాలో వో డ్రాయింగు రూము. దానిమధ్య ఒక రౌండు టేబిలు. చుట్టూత అయిదారు కుర్చీలు. గోడలకు నాలుగువైపుల నాలుగు స్ప్రింగులు చెడ్డ సోఫాలు. ఒక పుస్తకాల అలమైరా ఓప్రక్కన అమర్చివుండేది. టేబిల్ మీద ఓ తెలుగు పత్రిక, ఓఇంగ్లీషుపత్రిక, రెండుమూడు మాసపత్రికలు యెప్పుడూ వుండేవి. మాధవరావుగారు తరుచుగా బంధువులనే గాని మిత్రులనే గాని రిసీవ్ చేసేది యీరూములోనే. ఉదయాన్నే లేవడం, కాఫీ పుచ్చుకొన్న తడవే ఈరూములోకి వచ్చి కూర్చొని, ఏదో పేపరు చదువుకోవడం. తనను చూడడానికెవరైనా వస్తే దర్శనమిచ్చి సందర్భానుసారంగా, తమ వంశగౌరవం, తనగౌరవం, తనకేదో ఊపిరితిరుగనంత కార్యభారంవున్నట్టుమాట్లాడుతూ వుండేవారు. పదిగొట్టగానే లేచి భోజనవ్యవహారాలు చూచుకొని, పన్నెండుగంటలకు పడకేశేవారు. నాలుగ్గంటలు కాగానే తిరిగి కాఫీ. ఆపైన క్లబ్బుకు బయలుదేరేవారు. బిళ్లగోచి, నల్లని సర్జిలాంకోటు, తెల్ల జరీ తలపాగా, నిడివికి మడిచి యిస్త్రీచేసిన జరీఅంచు కండువా పైన, కలకత్తా ఆఫ్ స్లిప్పర్సు తొడిగి, చేతిలో వెండి పన్ను కర్ర పట్టుకొని బయలుదేరేవారు. ఆనల్లనిమీసాలు, రోజు విడిచి రోజు తప్పకుండా ముఖక్షౌరం చేసికొని యెర్రగా నిగనిగలాడే ముఖం చాలా అందంగానే వుండేది. ఊళ్లో యెక్కడ సభ జరిగినా సరే మాధవరావుగారు హాజరు. తరువాత ఎవరైనా కాస్త మాట్లాడమని అడిగితే సరి, ఏవిషయమైనా తనకు తెలియనిది లేనట్లు, సభలో యేగైర్యమైన కుర్రవాడో 'చాల్లేవయ్యా సొద, కూర్చో' అన్నంతవరకో, ప్రెసిడెంటుగారు మూడుమాట్లు తన గడియారంవంక, ఆయన ముఖంవంక చూచేవరకో, లేకుండాపోతే సభలో వొకరి వెనకాల వొకరే, సభ పల్చబడేదాకా, లేచిపొయ్యేవరకో దుంప తెగేశారన్నమాటే. వితంతువివాహాలు, రజస్వలానంతర వివాహాలు, అస్పృశ్యత, యీ, ఆ, విషయ మేమున్నదని, అన్నివిషయాలనుగురించి మాట్లాడేవారు. ఈవైఖరి చూచి ఊళ్లో అందరు లీలకు యేరిఫారం మ్యారేజో చేస్తారనుకొనేవారు. పైగా లీలచదువువిషయంలో కూడా చాల శ్రద్ధ వహిస్తూవుండేవారు. లీలకు పదిసంవత్సరాలు దాటాయి. ఫర్దుఫారం చదువుతుండేది. ఇంతలోకే నేను మాధవరావుగారింట ప్రవేశించడమయింది.

నాకు చిన్నతనంలోనే తల్లిదండ్రులు గతించి, తన మన అనే ఆప్తులే లేకపోవడంచేత విజయనగరంలో వారాలు చేసికొని, చదువుకొంటూ వుండేవాడిని. నాకు మొదట్లో మాధవరావుగారింట్లో ఒకటే వారం వుండేది. ఉండడంమాత్రము వారింట్లోనే వుండి చదువుకొంటుండేవాడిని. లీల కప్పుడప్పుడు చదువుమాత్రం చెబుతుండేవాడిని. ఆసంవత్సరం నేను యింటర్మీడియట్లో ప్రెసిడెంసీఫస్టువచ్చి మెడలు సంపాదించిన తరువాత మాధవరావుగారికి నామీద యెందుచేతనో అపారమైన ప్రేమ కలిగింది. నన్ను తనింటిలోనే వుండమని బలవంతం చేశారు. మొదట్లో నే నౌకరిమీదనే ఆధారపడివుండడం యిష్టం లేక వొప్పుకోకపోయినా, మాధవరావుగారు, సుందరమ్మగారు అదేపనిగా బలవంతపెట్ట మొదలుపెట్టినతరువాత వొప్పుకోక తప్పిందికాదు. భార్యాభర్త లిద్దరూ నన్ను క్రమేణ తమపిల్లవాడిలాగానే ప్రేమిస్తూవచ్చేవారు. మాధవరావుగా రిప్పు డెవరైనా క్రొత్తవాండ్లు తనింటికి వస్తే చేశే ప్రసంగాలలో నాప్రస్తావనగూడా వొకటి. ప్రసంగవశాత్ నేను మహా తెలివిగలవాడనని, ప్రెసిడెంసీఫస్టు వచ్చానని చెప్పుచు, విసుగువిరామం లేకుండా నాప్రెసిడెంసీమెడల్ చూబిస్తూవుండేవారు. ఇదంతా వారి చలవవలనేనని ఆక్రొత్తవా రర్థంచేసుకొనేదాకా దుంప తెగేశారన్నమాటే!

ఇల్లా వుండగా లీల పెండ్లివొత్తిళ్లు యింట్లో కలిగేయి. 'మాధవా! నీమతి పోయిందట్రా! వంశనాశనానికి పుట్టిన్నట్లున్నావు. అంతబ్రతుకు బ్రతికి ఆఖ

రకు మహబీర్‌వారి సంబంధాలు వారపుబ్రాహ్మల తోను, పూటకూటింటివారితోను చెయ్యాలనుకోడం యిన్నాళ్లకు నీతరంలో మొదలెట్టా లనుకొన్నావట్రా! బ్రతికివుండి ఈ అరాచకాలన్నీ చూడమని కాబోలు ఆ మహారాజు చచ్చిపోయినాడు. నాకు చావైనా రాద యిపోయె.' అను మాధవరావుగారి తల్లి ముసలమ్మ యేడుపుతో లీలను నాకిచ్చి పెండ్లిచెయ్యాల ననుకొనే తలంపు యెగరేసుకొనిపోయింది. వంశగౌరవాన్ని నిలుపుకోడానికి తగ్గసంబంధానికై మాధవరావుగారు మహా తిప్పలు పడ్డారు. ఎక్కడైనా కాస్త అనుకూలంగా దొరికితే వాండ్లు కోరే కోర్కెలను నెరవేర్చడానికి మాధవరావుగారి తరమయ్యేటట్లు కనిపించలేదు. ఆఖరకు వెంకోజీవారి సంబంధం నిశ్చయించుకొన్నారు.

ఓరోజు సాయంకాలం నాలుగ్గంటలకు, ఇద్దరు తలనెరసిన పంతుళ్లు, కూడా పట్టెడు సిగ, ముదురు మొగం, బక్కగాపొడుగ్గా వుండే మరోవ్యక్తిని వెంట బెట్టుకొని దిగబడ్డారు. ఆవరకే యెవరో వస్తారని, యేర్పాట్లన్నీ చేసివుండడంచేత, పంతుళ్లు ముగ్గురూ వచ్చి హాలులోని కుర్చీలమీద కూరున్నారు. లీలకు సంబంధం కుదిర్చే పెద్దమనిష్యుల్లా, కనిబించారు. ముసలమ్మ తలుపు కానుకొని కాస్త యెడంగా, తెల్లని మల్లుధోవతి ముసుగుతో, చేతిలో



జపమాల పట్టుకొని, క్షేమా లడుగుతూ, ఆనందంగా కూర్చుంది. తలుపురెక్క అడ్డంచేసికొని అప్పుడప్పుడు తల బయట బెట్టి మాస్తూ నిలుచుంది సుందరమ్మగారు.

మాధవరావుగారు ముస్తాబా చేసికొని మూడుమాట్లు మేడ మీది నిలువుటద్దం ముందగ మీసాలను సరిదిద్దుకొని క్రిందికి దిగివచ్చారు. నలుగురు కూర్చొని ఆమాట యీమాట మాట్లాడుకొంటుంటే మన కెందుకని నేను వెళ్లిపొయ్యేను. వచ్చినవాండ్లు వెళ్లేక, "శేఖరం! పెండ్లికొడుకును చూచావూ?" అంది సుందరమ్మగారు నవ్వుతూ. పెండ్లికొడుకు కెప్పుడొచ్చాడా అని ఆలోచిస్తూ, 'లేదే' అన్నా. "ఆయనే, ఆమధ్యకూర్చున్నాయనే" అని యిక సంబంధం కుదరలే దనేబాధ తప్పిందనే సంతోషమంతా వుట్టిపడేటట్లుంది. నేను దిగ్భ్రమచెందా ఆమాట వినడంతోటే. ఆవయ సేమిటి! ఆ ఆకార మేమిటి! ఆపురుషునికి తీసికొనివెళ్లి బంగారం వంటి లీలను కట్టిపెట్టటం యేమిటి! ముసలమ్మ చెల్లెలు కూతురుకొడు కట. బాగా ఆస్తి వుందని రెండో పెండ్లికివ్వా లనుకొన్నారట! ఈవిషయంలో మాధవరావుగారికి మతి పోయిం దనుకొన్నా. ఆరాత్రంతా నా కిదే ఆలోచన. కాస్త కండ్లుమూస్తే సరి,ఆవిగ్రహం కలలో కనిబించేది. ఏమనుకొన్నా సరే, మాధవరావుగారితో యీసంబంధం మానవలసిందని చెప్పేద్దా మనుకొన్నా. కాని తెల్లవారేటప్పటికి నా కాధైర్యం చాలింది కాదు. పైగా యింకోచిక్కుగూడాను. లీలను నాకిచ్చి వివాహం చెయ్యాలనని టూకీగా అనుకోనుండడంచేత, యిందు స్వార్థము, ద్వేషభావం వుందని యెక్కడను కోపొతారో అని భయంకూడా వేసింది. లీలతోమాత్రం నీ కీసంబంధం మంచిది కాదు, నేను చేసుకోనని గట్టిగా తల్లిదండ్రులతో చెప్ప మన్నాను. ఇది కేవలం నాపిచ్చికాని లీల చెప్పగలదా? చెబితే వాండ్లు వింటారా? ఎల్లాగో వివాహం జరిగిపోయింది. కొన్నాళ్లు గడిచింది. పిల్ల పెద్దమనిషి కాలేదు........................ పిల్లను పంపమని లీల అత్తగారు కబురంపారు. ......

.............................................

........... మాధవరావుగారి కిప్పుడు వోళ్లు తెలిసింది. దీనితో కొంత వారికి వీరికి మనఃస్పర్థలు కలిగేయి.

"ఇంతకు దాని గ్రహచారాని కెవ రేమి చేయగలరు!" అని అభము శుభము తెలియని లీలను నిందించడాలు యింట్లో ఆడవాండ్లు మొదలుపెట్టేరు. లీల కిప్పుడిప్పుడు కొంత జ్ఞానం తెలుస్తూవచ్చింది. తన్ననవసరంగా యిందుకు బాధ్యురాలను చేస్తున్నారని, తనకు తగిన వరుడు కాడని గ్రహించింది. దీనికితోడిప్పుడు లీల యుక్తవయస్కురాలయింది. లీల కిప్పుడాఉత్సాహమే లేదు. ఎప్పుడు యింట్లో ఏదో విచారంగా వుండేటట్లుండేది. వేళకు అన్నం తినేదికాదు. తలనొప్పి అనో, కాలునొప్పి అనో కళ్లనీళ్లు పెట్టుకొంటూ పడుకొనేది. ఎవరైనా దగ్గిర కొస్తే కసురుకొనేది. ఇప్పుడు నన్ను చూచి బెదరిపోవడం, తలుపు చాటు దాక్కోడం క్రమేణ తగ్గిపోయినాయి. కాస్తమాట, పలుకుకూడా వుండేది. కాని చూపులలోమాత్రం నూతనత్వం వచ్చింది. కూర్చొన్నున్నంతసేపు తలెత్తకుండా వుండి లేచిపోతూపోతూ వోవిధమైన వారచూపు నూచేది. పదిమందిలో వున్నప్పుడు తన చూపు నాకక్కరకురానట్టు మెలిగేది. ఒంటరిపాటున తన రెండుకండ్లు వొక్క నాకొరకే సృష్టింపబడ్డట్టు చూచేది!

ఇల్లా వుండగా మా బి. ఏ. పరీక్షలు సమీపించాయి. ఇంట్లో కూర్చొని చదువుకోడానికి యెవరో వొకరు వచ్చి మాటలు పెడతారని సందడిగా వుంటుందని, మాధవరావుగారి బంగాళా కానుకొనేవుండే తోటలోకి వెళ్లి కూచొని చదువుకొంటుండేవాడిని. ఓరోజు మధ్యాహ్నం మూడుగంటలయింది. మబ్బు చాలా గాఢంగా కమ్ముకొచ్చింది. మెరుపులు మెరుస్తున్నాయి. ఉరుములు వురుముతున్నాయి. ప్రకృతి మహాభయంకరంగా వొక్కక్షణంలో మారిపోయింది. మల్లెపొదలదగ్గిర యెవరో మనిషి కదిలినట్లయింది. ఎవగా అని పరీక్షించి చూచేటప్పటికి, కొర్నాటిచీర, బారెడుజడ—లీల! గుండె జల్లుమన్నది. ఇన్నాళ్లగ్గా నేను మాలీల యిటీవలెప్పుడు వొంటరిగా తటస్థపడలేదు. ఇప్పుడందులోకి యింట్లో వెయ్యికండ్లతో కనిబెట్టివున్నారు. గాలివానకూడా ప్రారంభించడంచేత కాబోలు గబగబ లీల నేనున్న తోటవసారాలోకి పరుగెత్తుకొంటూ వచ్చింది.

ఇదంతా వోనాటకంలా కనిబించింది. ఎన్నడు స్టేజి అంటే యెరుగనివాడు వేషం వేసికొని స్టేజిమీద నిలబడితే వణికినట్లు వొణికాయి నాకాళ్లు. నూట రాలేదు. వెర్రిచూపు చూచాను లీలకేసి. లీల మాట్లాడకుండా, బ్రహ్మాండమైన వర్షము, ఇటుకరాళ్లంత వడగండ్లు పడుతుంటే, భయపడ్డట్టు చూస్తూ (నాకేసి చూడకుండానే) నిలుచుంది. లోపలిమనిషి బయటికిగాని బయటమనిషి లోపలికిగాని కదలడం ప్రాణాపాయంగా కనిపించింది.

నేను—లీలా! ఏం? ఇలా యెందుకు వచ్చావు?

లీల—నాన్న క్లబ్బుకు వెళ్లేరు. అమ్మ పేరాజుగారింటికి వెళ్లింది. అవ్వ నడిగ తోట్లో మల్లెపూలు కోసుకుందామని వచ్చా.

నేను—నేను తోటలో ఉన్నానని తెలేదు అవ్వకు?

లీల—తెలేదు.

నేను—నీకైనా తెలేదా?

లీల—తెలుసు. అందుకోసరమే వచ్చాను, పూలకని చెప్పి. నీతో మాట్లాడవాలెనని యెన్నిరోజులనుండో అనుకొంటుండేదాన్ని. ఎప్పుడు యెవరో ఒకరు వుండడంచేత వీలయిందికాదు.

నేను—ఇప్పుడు మన మేమి మాట్లాడి యేం లాభం? ముహూర్తంకూడ నిశ్చయించారు కారూ? ఆఖరుకు మన కింక ఈ కండ్లచూపులైనా లేకుండా పోతాయి.

మరి మాట్లాడలేదు. తల వంచుకొని కండ్ల నీరు గారుస్తూ అల్లాగే నిలుచుంది. నేను దగ్గరకు వెళ్లి మీద చెయి వేసి, 'లీలా! యిప్పుడెవరం యెంతదుఃఖించినా లాభం లేదు. జరిగిపోయిందేమో జరిగిపోయింది.' అని అంటుంటే దగ్గిరకు వచ్చి నాయెదపై తన తల మోపి యేడుస్తూ నిలబడింది. నాకేమి తోచిందికాదు. అలాగే వెనక్కు నాలుగడుగులు నడిపించి నేను చదువుకోనే టేబిల్ కానుకొని లీలను కౌగిటిలోనే వుంచుకొని నిలబడ్డాను. ఇంతలోకే మరోవేపునుండి గొడుగు పట్టుకొని

సుందరమ్మగారు లీల నాకౌగిట్లో వుండడం చూచింది. లీల చప్పున జరిగి గోడవేపు ముఖం చేసికోని నిలబడింది.




నాకు ప్రపంచమంతా తిరిగిపోయినట్టుగా, వొంటిలో నుండి ఆవిర్లు బయలుదేరి, కదల మెదలడానికి శక్తి లేక అల్లాగే తలవంచుకొని నిలబడ్డాను. "లీలా పోదాం పా" అని సుందరమ్మగారు మామూలు ధోరణిలోనే అంది. తల్లివైపు ముఖం యెత్తిమాడకుండానే లీల యింటికి నడవడం ప్రారంభించింది. వెనకాల సుందరమ్మగారు గొడుగు వేసికొని బయలుదేరింది. నాముఖంకేసైనా చూడలేదు సుందరమ్మగారు. అప్పటికప్పుడే వర్షం తగ్గి తెరపిచ్చింది. అది నేను గమనించనేలేదు. లీలదుఃఖాన్ని చూచి చెట్లుకూడ పరితపిస్తున్నట్లు పెద్దపెద్ద కంటినీటి బొట్లను రాలుస్తున్నాయి. బ్రహ్మాండంగా ప్రకృతినంతా ఒక్కగడియలో ముంచివేసేటట్టు మేఘాలు కమ్ముకో వచ్చి చీకటిమయం చేసివేసిం దల్లా తెరపిచ్చింది. ఇంత హడావుడి యింతికేనా అని కాబోలు ప్రకృతికాంత మందహాసం చేస్తూ వున్నట్టు తెల్లని వెన్నెలలాంటి యెండ చెట్లమీద కనిబిస్తూవచ్చింది. తనాడించే నాటకం అంత మొందిందని కాబోలు, నవ్వు ముఖంతో సూర్యుడు చల్లగా జారుకొంటున్నాడు.

నా కేమి తోచిందికాదు. ఏదోమహాపరాధం చేసినట్టు గుండె కొట్టుకోవడం మొదలుపెట్టింది. తిరిగి యేమొహం పెట్టుకోని యింట్లోకి వెళ్లడం? సుందరమ్మగా రెల్లాగో తను చూచిన సంగతల్లా ముసలమ్మతో, మాధవరావుగారితో చెప్పకపోదు. మాధవరావుగా రింక నన్ను తనకొడుకులా ప్రేమించడం యెల్లా సాధ్యమవుతుంది? అయినా యిందులో నేను బుద్ధిపూర్వకంగా చేసిన నేర మేమి లేదు. నానేర మేమి లేదని వాండ్లకు తెలిసే దెల్లా? లీలది తప్పనుకోడానికికూడా పాపం! ఆమెదిమాత్రం తప్పేముంది? తోటలోకి పూలకోసం వచ్చింది. వర్షం వస్తుంటే తప్పనిసరిగా వసారాలోకి పరుగెత్తుకొంటూ వచ్చింది. అయినా యిప్పు డిదంతా విచారించేవాం డ్లెవరు? కొడుకులా ప్రేమిస్తూ, అన్ని విధాలా నాసౌఖ్యమే వాండ్ల సౌఖ్యంలా భావిస్తూ, చిన్నకుటుంబంలోవాడినైనా తమబిడ్డనుకూడా యిచ్చి వివాహం చెయ్యవాలె ననుకొనేటంత ఉదారభావం కలిగినవారిని ద్రోహంచెయ్యడానికి తలపెట్టేనని తలుస్తారా? ఏమి తోచిందికాదు. మరేమి మాట్లాడ కా దారి నలాగే పారిపోయి ఎక్కడనైనా దాక్కుందామా అనిపించింది. ఇది మరీ అప్రతిష్ఠకు కారణమవుతుంది. పైగా కట్టుబట్టా నేను వున్నాను. ఇల్లా పరిపరివిధాల ఆలోచనచేస్తూ కుర్చీలో ఆలాగే నిద్రపొయ్యేను.

రాత్రి యెనిమిదిగంట లయింది. 'శేఖరం! ఏమప్పుడే నిద్రపోతున్నావు? లే, పోదాం భోజనానికి' అని మాధవరావుగారు ప్రత్యేకించి నాకోసరం తోట్లోకి వచ్చి లేపేసరికి నా కాశ్చర్యం వేసింది. లోపల గుండె మాత్రం కొట్టుకుంటూనేవుంది. కాని సుందరమ్మగారు ఈసంగతి ఎవరితోనూ చెప్పలేదనే ధైర్యం మాత్రం కలిగింది. మాధవరావుగారు నన్నెంత ప్రేమిస్తూ వున్నా స్వయంగా వచ్చి పిలవడం తన గౌరవానికి హాననే వుద్దేశంతోటే వుండేవారు. ఎవరిచేతనైనా పిలిపించేవారే కాని యింతవరకు యెప్పుడు స్వయంగా వచ్చి పిలిచింది లేదు. ఈపర్యాయం సుందరమ్మగారే యిందుకు కారకురాలై వుండవలెనని తోచింది. నాటినుండి సుందరమ్మగారి ముఖం చూడడానికే నాకు భయంగా వుండి తలవంచుకొనే వారితో మాట్లాడుచుండేవాడిని. సుందరమ్మగారు నా భయాన్ని గ్రహించి, ఆభయాన్ని తీసివేద్దామని కాబోలు, అతిదయగా మాట్లాడుతూ

నన్నెల్లాగైనా పూర్వంమాదిరే యింట్లో కలసి మెలసి తిరిగేటట్టు మాచేది. కాని లీలనుమాత్రం కడుపులో పెట్టుకొని కాపాడుచుండేది.

ఆరోజు మాధవరావుగారి తండ్రి తద్దినం. మాధవరావుగారు కర్మకాండలో పడివున్నారు. సుందరమ్మగారు, మసలమ్మ వంటవ్యవహారాలు మాచుకొంటున్నారు. మైలవస్తువు లందిస్తువుంది లీల. నేను మేడపైన కుర్చీలో పడుకొని ఏదోపుస్తకం చూస్తూ అలాగే నిద్రపొయ్యేను. చల్లగా నానుదిటిమీద మెత్తనిచెయ్యి పడే టప్పటికి ఉలికిపడి లేచా. చూస్తే లీల! మరిహ నాకు ముందు వెనకా యోచనే పోలేదు. చట్టున లేచి గట్టిగా చంప నొక్కి ముద్దెట్టుకొని కౌగలించుకొన్నాను. ఇల్లా వొకరికొకర్లో వొకరం ప్రపంచాన్ని మరచిపోయి మన సులతో మాట్లాడుకొంటూ చిత్రించిన బొమ్మల్లా అయిపొయ్యేము. ఒకభుజంమీద రెండు తడిపిపిండిన చీరలు, ఇంకోచేత ఒక తడిపిపిండిన ధోవతిని విప్పి కుచ్చిళ్లు పోసికుంటూ, బట్ట లారెయ్యడానికి కాబోలు చప్పుడు గాకుండా మేడమె ట్లెక్కి వచ్చింది సుందరమ్మగారు. నిర్ఘాంతపోయింది. లీల మొహం అటువైపు చేసివుండడంచేత గూడడానికే అవకాశం లేక



'లీల గబిక్కని ..................తల వంచేసింది.'


పోయింది.అయితే సుందరమ్మగారికి లీలను నాపై యెంత గాఢమైన ప్రేమే మున్నదో తెలియడాని కవకాశం కలిగింది. నేను మాస్తూనే అలాగే నిలబడ్డాను కాని, ఒక్కక్షణం నాకు కండ్లు కనిపించాయి కావు. చక్కగా మాస్తూనే కండ్లు కనిపించని అదో ప్రపంచంలో వుండిపొయ్యేను. వెంటనే వొళ్లు తెలిసింది. 'అమ్మ' అని మెల్లగా లీలచెవిలో వూదుతూ గట్టిగా నన్ను అంటబెట్టి చుట్టివేసికొనిన లీల రెండు చేతులను నారెండుచేతులతో బట్టి లేవదీశాను. లీల గబిక్కని వదిలేసి సుందరమ్మగారి మొహం మాచి తలవంచేసింది. సుందరమ్మగా రల్లాగే నిలబడింది. ఎవరికి యేమి తోచిందికాదు. సుందరమ్మగారు మెల్లిగా నాకు సమీపించి, 'శేఖరం! నీ వెంతో తెలివిగలవాడ వనుకొన్నాను. కన్నకడుపుకన్న పెంచినమమకారం యెక్కువవడంచేత, కడుపు చించుకొంటే కాళ్లమీద పడుతుందని, పోనీ నీకే తెలివి వస్తుందికదా అని మాస్తుంటే, నీతెలివి తెల్లవారినట్లే వుంది! ఇంత చదువుకొన్నావు, యేం లాభం? అదంటే అది పశువు. మాకడుపు చెడబుట్టింది. వంశాన్నంతా అప్రతిష్ఠపాలు చెయ్యడానికే దాపరించింది. నీవుకూడా దాని గొంతు కొయ్యడానికే యిల్లా జేస్తున్నావు. గడపముందర్నే కదా దానత్తా రిల్లు? కాస్త గాలికబురుగా వాండ్లకు తెలుస్తుం దనుకో,యింక దాని క్షేమైన పుట్టగతు లుంటాయా?' అని తలవాచేటట్లు చీవాట్లు పెట్టి సుందరమ్మగారు తనపనిమీద తాను వెళ్లిపోయింది. లీల అప్పుడే యీమాటలమధ్య చల్లగా జారుకొంది. కాని మాసుందరమ్మగారికి నాపైనెంత ప్రేమో చెప్పలేను. నాకు చిన్నతనంలోనే తల్లి పోవడంచేత, తల్లిప్రేమైనా యింత గాఢంగా వుంటుందో వుండదో సందేహం. ఆ! అంటే చాలు, ఆగడపైనా త్రొక్కడానికి వీలు లేకుండా చెయ్యడానికి. ఆరోజు మొదలు సుందరమ్మగారిని నాహృదయంలో తల్లిలాగ ప్రేమించుకొనడమే గాకుండా, గురుభావం వుంచుకొని పూజించుకొనేవాడిని.

ఇంతలోకే మా బి. ఏ. రిజల్ట్సుకూడా వచ్చాయి. బి. ఏ. లో ఫస్టుక్లాసులో రావడమే కాకుండా గవర్న

మెంటు స్కాలర్‌షిప్ మీద నన్ను యింజనీరు పరీక్షకు చదవడానికి ఇంగ్లండు పంపదలచినట్లుకూడ తెలిసింది. ఇప్పు డింక మాధవరావుగారి ఆనందానికి మితిలేదు. ఆరోజంతా, కాస్త పని లేదు ఘడియతీరిక లేదన్నట్లు కనిపించారు మాధవరావుగారు. ఆఖరుకు ఏబాకీదారుడో పైక మడగడానికి వస్తే, 'పదిరోజులు నిదానించాలె, మా శేఖరం, యింగ్లండు వెళ్లుచున్నాడు' అని చెప్పి పంపేవారు. కొందరు మిత్రులు నన్ను గౌరవిస్తూ టీపార్టీ లిచ్చారు. మాధవరావుగారు వెంటబెట్టుకొని వెళ్లేవారు. తిరిగి వీరందరికి మాధవరావుగారింట్లోనే విందు చేసి, 'మా శేఖరాన్ని తిరిగి సుఖంగా మన దేశానికి వచ్చేటట్టు దీవించండి' అని పాపం తండ్రిలా ప్రాధేయపడేవారు. ఆపుకోలేక కండ్లనీళ్లుకూడ పెట్టుకొనేవారు. నాకుకూడ మాధవరావుగారి కుటుంబాన్ని వదలిపోవడం మహాకష్టంగా వుంటూవచ్చింది. ఇంగ్లండుకు సుఖంగా చేరాను. కొన్నాళ్లు ఉత్తరప్రత్యుత్తరాలద్వారా వొకరి క్షేమాలు వొకరికి తెలుస్తూవచ్చాయి. రెండేండ్లు కావచ్చింది. దేశమంతటా ఇన్ఫ్లుయంజా జ్వరాలు చుట్టివేసినట్లు, ఒక్క లీల తప్ప మాధవరావుగారి కుటుంబమంతా అంతరించిందని, ఋణములచేత యిల్లువాకిలికూడా లేకుండా పోయిందని తెలిసింది. నాకీచదువంతా నిరర్థక మనిపించింది. నన్ను, నా చదువును చూచి ఆనందించేవాండ్లు కాని, నా క్షేమం కోరేవాండ్లు కాని, ఈ ప్రపంచంలో మరెవరు లేరు. ఒక్క మాలీల. ఆమైనా అత్తగారింట్లో సుఖంగా వున్నందుకు భగవంతుని వేయివిధాల ప్రార్థిస్తూ, సంతోషపడుతుండేవాడిని. మరి రెండేండ్లదాకా నాకు దేశానికి రావడానికే వీలు లేకపోయింది. ఉత్తరాలు వ్రాసేవాళ్లుకూడ లేకపోయినాగు. ఒకటిరెండు పర్యాయములు, లీలకే క్షేమసమాచారాలు తెలుపమని వ్రాయాల ననుకొన్నాను. కాని యిది లీలసౌఖ్యానికి భంగకర మేమోనని దడిచి మానేశాను. నాకోర్కె పూర్తికావడమునకు అయిదేండ్లయింది. రాగానే, యు. పీ. లో ఛార్జీ పుచ్చుకోవలసివచ్చివుండడంచేత, విజయనగరం వెళ్లడానికే వీలయిందికాదు.

కాలవాహిని ఖండభూభాగాలనే మాయింపజేసే శక్తిగలది. అలాంటప్పుడు ఒక్కమానవుని మనోవ్యాకులతను మాయింపజేయడం దానికో లెక్కా? నాఉద్యోగం, నాఅధికారం, నూతనమిత్రబృందముల రాకపోకలు వీటితో జీవితంలో నూతనాశయాలు అంకురించాయి. ఓరోజు సాయంకాలం కొందరిమిత్రులతో కలిసి సినిమాకు వెళ్లాము. ఎనిమిదిగంటలు దాటింది. తిరిగి మిత్రులతో కారులో బయలుదేరి యింటికి వస్తున్నాము. కొంతదూరం వచ్చేసరికి కారుదీపాల వెల్తురులో రోడ్ ప్రక్కన ఎవతో ఓస్త్రీ వొళ్లు తెలేకుండా పడివుంది. వెంటనే కా రాపి, ఎవతో అనాథస్త్రీ అయివుంటుందని కారులో అలాగే తీసికోవెళ్లి ఆసుపత్రిలో చేరిపించాము. తెల్లవారగానే నాగొడవలో నేనుండి ఆసంగతే మరచిపోయ్యేను. సాయంకాలము నౌకరీనుండి యింటికి రాగానే ఆసుపత్రినుండి తక్షణం వచ్చి మాట్లాడివెళ్లవలసినదని, డి. యం. వో. ఒకచీటి వ్రాసి పంపించారు. చూడగానే రాత్రిసంగతి జ్ఞాపకంవచ్చి తక్షణం కారు వేసుకొని వెళ్లేను. నన్ను చూడగానే డి. యం. వో. నవ్వుతూ షేక్‌హేండిచ్చి తీసికొనివెళ్లి తన ఆఫీసురూములో కూచోబెట్టారు. "నిన్న మీరు ప్రవేశపెట్టిన స్త్రీకి వొళ్లు తెలిసింది. ఏమో మాట్లాడుచున్నది. మా కాభాష తెలియడం లేదు. 'విజయనగరం, శేఖరం, యింజనీరు' అన్నమాటలుమాత్రం తెలుస్తున్నాయి. మీ కేమైనా తెలుస్తుందేమో మాట్లాడండి" అన్నారు డి.యం.వో. గారు. నాకు ఆశ్చర్యం వేసింది. విజయనగరంలో నన్నెరిగిన స్త్రీ యెవతై యుండవచ్చు? ఉన్నా యిక్కడికి రాగలిగినవా రెవరు? ఆకాసేపట్లో నే నేదో మహాపరాధం చేసినట్లు గుండె దడదడ గొట్టుకొందు పరిపరివిధాల ఆలోచనలు పోయినాయి. లేచి వెళ్లడానికి కాళ్లు వణికాయి. 'రండి వెళ్లి చూద్దాం' అని డాక్టరు నవ్వుతూ నాచెయ్యి పట్టుకొని యీడ్చారు. లేచేను. నామనస్సు మనుస్సులో లేదు.

ఏమి! లీల! ఇక్కడి కెల్లా వచ్చింది. ఈఆకారమేమిటి? ఇట్లయిపోవడానికి కారణ మేమి? నా



కేమైన మతి చెడిందా? నిద్రపోవడంలేదే కలనుకో డానికి!

ఇంతలో డాక్టరుగారు "ఈరోగిని మీ రిదివరలో చూచియుంటిరా? ఈమె హిస్టీరియావ్యాధిచే కుంది పోవుచున్నది. మే మిక్కడీమె నుంచి చేసే చికిత్సేమి వుండదు." అని అన్నారు. "అయితే ఈమెను నే నింటికి తీసికొనివెళ్లి వుంచెదను. అవసరమైన మీ రచటికే వచ్చి చూచి చికిత్స జరుపవచ్చును." అని మేమింగ్లీషులో మాట్లాడుకొంటుంటే, లీల బిక్కమొహం వేసి నావంక చూస్తూ వుంది. "ఇంటికి వెడ్తాము, వస్తా విమ్మా? డాక్టరుగారక్కడికే వచ్చి చూస్తూ మందిస్తారు" అని లీలతో

అన్నాను. ఎందుకనో వెంటనే కండ్లనుండి జలజల నీళ్ల బిందువులు రాలాయి. చట్టున లేచి తయారయింది. కారులో యింటికి వెళ్లాము.

క్రమేణా, నే నింగ్లండుకు వెళ్లినతరువాత తన తల్లిదండ్రులు పోవడం, నెలతిరగకుండానే తనకు వైధవ్యం సంప్రాప్తించడం, తన బావగారు, యీ వ్యాధి మూర్ఛని, తన భార్యాపిల్లలకు యింట్లో వుంటే వస్తుందని, యిష్టమున్నప్పుడు వాకిట్లో యింతతిండి పడేయ్యడం, చివరకు ప్రాణం విసిగి, నే నిక్కడున్నానెవరో మిత్రులు చెబితే, చేతిమురుగు లుంటే అమ్మేసి బయలుదేరి ఇక్కడికి వచ్చి, ఆఖరుచూపు చూచి యెందులోనైనా పడి ప్రాణం వదలుతా ననుకోడం, మొదలైన సంగతులన్నీ తెలుసుకొన్నాను.

ఆడదక్షత లేకపోయినా నౌకర్లను బెట్టి జాగ్రత్తగా ఉపచారం చేయిస్తూవచ్చాను. మూడుమాసము లయింది. మరెప్పుడు తిరిగి ఆవ్యాధి రాలేదు. డాక్టరుగారు వచ్చి, "ఈమె కింక ఆవ్యాధి వస్తుందనే భయమేమి లేదు. మనోవ్యాకులతే యిందుకు కారణము" అని చెప్పినారు. మూడుమాసాలలో మునుపటి మాధవరావుగారి తోటలో విహరించే 'లీల' అయింది.

మరిప్పుడు...............?

---

# గోపికాగీతము

పేరేప విశ్వనాథసిద్ధాన్తిగారు

౧

కొన్నులు పైటకొంగున వగర్ బిగియించి తిదేమి కృష్ణ? నీ
చెన్నగు గజ్జె లందియల చిందులసందడి విందు, నీ వహో!
వెన్నను దొంగిలింప నిటు వేసము లెన్నియొ వేయు, దైన నా
కన్నులవిందుగా నగుమొగ మ్మొకమారి పుడేనిఁ జూపవే.



9- . 8 3౯౫